# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు సమావేశమై పలు అంశాలపై చర్చించారు.**

**2. రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్ ఆసుపత్రులను నిర్మిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

**3. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.**

**4. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" కార్యక్రమం ఈ నెల 6వ తేదీన ప్రసారం కానుంది.**

==========================

గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడితో ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం వంటి అంశాలపై ఇరువురు నాయకులు చర్చించారని అధికారులు తెలిపారు.

ఈ మధ్యాహ్నం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు శాఖలపై సమీక్ష నిర్వహించనున్నారు. తొలుత బీసీ సంక్షేమ శాఖపై నిర్వహించే సమీక్షలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శాఖ పరిధిలో పథకాల అమలు, అభివృద్ధి పనులు, బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై తీసుకున్న చర్యలపై అధికారులను ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకోనున్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్, బ్రాండింగ్‌కు తీసుకోవాల్సిన చర్యలపైనా సమీక్షిస్తారని అధికారులు తెలిపారు.

-------------------------

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ బృందం లండన్ పర్యటన కొనసాగుతోంది. రెండో రోజు పర్యటనలో భాగంగా నగరంలోని క్వీన్ ఎలిజబెత్ ఒలింపిక్ పార్కును నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా 2012లో ఒలింపిక్స్ కోసం నిర్మించిన పలు క్రీడా పార్కులను మంత్రి పరిశీలించారు. ఫుట్‌బాల్, రగ్బీ, బేస్‌బాల్ పోటీలు నిర్వహించిన లండన్ స్టేడియంతో పాటు ఆక్వాటిక్స్ సెంటర్ నిర్మాణాలను మంత్రితో పాటు అధికారులు అధ్యయనం చేశారు. అనంతరం ఖతార్ పర్యటనకు మంత్రి బృందం బయలుదేరి వెళ్లింది.

---------------------------

ప్రపంచ క్యాన్సర్ నివారణాదినంగా ఈరోజు పాటిస్తున్నారు. 2 వేల సంవత్సరంలో పారిస్ లో జరిగిన మొదటి శిఖరాగ్ర సమావేశంలో క్యాన్సర్‌ను నివారించేందుకు అవగాహన కల్పించాలని, దీనికోసం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన క్యాన్సర్ నివారణ దినంగా పాటించాలని నిర్ణయించారు. వాతావరణ కాలుష్యం, రసాయనాలతో కూడిన ఆహారపదార్థాలు తీసుకోవడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం క్యాన్సర్ కు కారణమవుతున్నాయి. ఈ క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే నయమవుతుందని... శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు. క్యాన్సర్ నివారణదినం సందర్భంగా ఈరోజు దేశవ్యాప్తంగా పలు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్ ఆసుపత్రులను నిర్మిస్తున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ నివారణకు ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ..

..వాయిస్...36 సెకన్లు

---------------------------

ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈరోజు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన ర్యాలీని శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ ప్రారంభించార. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి సంబంధించి పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని ప్రతీ ఒక్కరూ విధిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అలాగే తిరుపతిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,

..వాయిస్...33 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తోందని పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో తైవాన్ కు చెందిన లక్స్ షేర్ కంపెనీ ప్రతినిధులు నిన్న సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఫైబర్ నెట్ రంగంలో సరికొత్త సాంకేతికత వినియోగం, వైఫై, ఓటీటీ వంటి సేవల గురించి మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, లక్స్ షేర్ సంస్థ తిరుపతిలోని ఎలక్ట్రానిక్ క్లస్టర్ లో ఇప్పటికే ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. రాష్ట్ర ఫైబర్ నెట్ రంగంలో పెట్టుబడుల ద్వారా స్థానికంగా దాదాపు 10 వేల మందికి పైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు గాడాలలో పులి పాదముద్రలను గుర్తించామని రాజమహేంద్రవరం సర్కిల్ అటవీ సంరక్షణ అధికారి బి.ఎన్.ఎన్.మూర్తి తెలిపారు. పులిని బంధించేందుకు

అటవీ శాఖ అధికారులు డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేశారని ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకొని అడవికి పులిని పంపించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" కార్యక్రమం ఈ నెల 6వ తేదీన ప్రసారం కానుంది. పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని తప్పక వీక్షించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు. ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి ఈ కార్యక్రమంలో తెలియజేస్తారు. ఈ సంవత్సరం దేవ్ మొగ్రా, కోయంబత్తూర్, రాయపూర్, గువహటికి చెందిన విద్యార్థులతో ఢిల్లీలోని లోక్ కళ్యాణ్ మార్గ్ లో చర్చించనున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తెలియజేశారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ ఏడాది 4.5 కోట్ల మంది నమోదు చేసుకున్నారు.

---------------------------

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలోని కూనపరాజుపర్వ గ్రామంలో 46 లక్షల రూపాయలతో నిర్మించనున్న కచ్చా రోడ్ల నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా 6 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను చేపట్టామన్నాని పేర్కొన్నారు.

---------------------------

క్రీడా స్ఫూర్తిని, శారీరక దృఢత్వాన్ని ప్రోత్సహించేందుకు క్రీడలు దోహదపడతాయని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో తండేవలసలో జిల్లా వార్షిక పోలీసు క్రీడా పోటీలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నిత్యం విధి నిర్వహణలో ఉండే పోలీసులకు ఇటువంటి క్రీడా కార్యక్రమాలు ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. క్రీడల ద్వారా సిబ్బంది మధ్య సమన్వయం, సహకారం పెరుగుతుందని మూడు రోజుల పాటు ఈ వార్షిక క్రీడలు జరుగుతాయని తెలిపారు.

=====================